# చర్విత చర్వణం

ప్రాయోజకులు

**అపరాల డీలర్ల అసోసియేషన్**

సిద్దిపేట - 502 103.

- ః సదా సమాజ సేవలో ః -

అధ్యక్షులు : శ్రీ మాడిశెట్టి బాల్‌కిషన్

ఉపాధ్యక్షులు : శ్రీ చొల్లేటి శేఖరం

ప్రధాన కార్యదర్శి : శ్రీ హరినాథుల సిద్దయ్య

కోశాధికారి : శ్రీ చకిలం కృష్ణమూర్తి

"ఎర్రజండ, ఎర్రజండ ఎన్నియలో ఎర్రెర్రని జండెన్నియలో....." కోరస్ పాట. కోరవయసు కోటలో పాగా. చప్ చప్ చప్ చప్.... జప్ జప్ జప్ జప్... నేల తల్లి గుండెల మీద కోడె వయసు పాదముద్రలు.

అర్ధరాత్రి, అపరాత్రి... చీకటి కాకుల చిద్విలాసం. టప్ టప్ టప్ టప్... సగటు కుటుంబం తలుపుల తలరాతల చప్పుళ్ళు.

టకటక... టకటక... అవే తలుపుల లబలబలు.

నిద్రాదేవి ఆవులింత.

కిర్ర్‌ర్ర్‌ర్... నోరు తెరిచిన తలుపులు. ఎగిరి పడిన యజమాని కనుబొమ్మలు.

"అన్నలమొచ్చినం. అన్నం బెట్టుండ్రి".

ఐదారుగురు జమా జట్టీలు. అందరి చేతుల్లో ఆయుధాలు.

"గింత రాత్రి ఎట్లన్నా?" యజమాని నరాల్లో రైళ్ళ పరుగులు. మొహం పంచవర్ణ చిత్రం.

"అదంతా మాకు దెల్వదు. కోడి బిర్యాని, పక్కకు పకోడి.. జల్ది తయారు గావాలె. లేకపోతే తెల్సుగదా!" అపీలుకాస్కారం లేని ఆదేశం.

తెల్సు. కాలో చెయ్యో ఖతం.

పట్టపగలు నడిబజార్లో దొరను నరికెయ్యడం, కరణం కళ్ళను బలవంతంగా లాగేసుకోవడం... దృశ్యాలు కళ్ళ ముందు గిర్రుగిర్రు. గుండె పీచుపీచు. అన్నలంటే హడల్ గదా!

లైటు వెలుతురు నుదిటి చెమట బిందువుల్లో తళ తళ తళ తళ.

అర్ధరాత్రి అన్నం వండి పెట్టనందుకే గదా బడి పంతులు కాలు విరిగింది! పోస్ట్‌మేన్ నడ్డి విరిగింది గూడా అందుకే గదా!

" వండి పెడ్దామయ్యా!" సింహం ముందు ముక్కు పచ్చలారని చిట్టెలుకలా నిల్చున్న ఇల్లాలి సలహా.

చుట్టుపక్కల నిద్రలేచిన ప్రాణాలు, భయం గుప్పిట్లో భజంత్రీలు వింటున్నాయి.

కరకర తెల్లవారకముందే లోకాన్ని నిద్రలేపాలనుకున్న కోడి పలావై కడుపుల్లోకి జారుకుంది.

"మా సంగతి ఎవలకన్నా చెప్తే ప్రాణాలు దక్కవు. జాగ్రత్త" తుపాకుల హెచ్చరిక.

కిచ కిచ కిచ కిచ.... కావ్ కావ్ కావ్ కావ్ ఉదయ రాగాలు.

గల్ గల్... ఘల్ ఘల్... ముంగిళ్ళలో ముదితల కాలిమువ్వల సవ్వడి.

"సప్తాశ్వ రథమారూఢం......"చెరువులో చల్లని స్నానాలు. కర్మ సాక్షి అర్ఘ్యం.... స్వాగత మంత్రం.

అరగని ఆరాటం. ఆగని సూర్య ప్రయాణం.

చిట చిట చిటచిట... ఎండ. ముదురుతున్న ఎండ.

చిటపట చిటపట... పొయ్యిల్లో మంట.

"గంత రాత్రి... మీ ఇంట్ల ఏమైందీ?" ఇరుగు పొరుగు పలకరింపులు. అన్నీ తెలిసినా ఏమీ తెలియని రంగు మొహాలు.

"ఆ... ఏమైందీ? ఏమీ కాలేదు" యజమాని నిట్టూర్పు.

బర్ర్... బర్ర్ర్.. బర్.. ర్... ర్....

ఆడుకుంటున్న పిల్లల కళ్ళల్లో దుమ్ము గొడ్తూ పోలీసు జీపు పరుగులు.

"పిల్లీ వచ్చే ఎలుకా భద్రం, ఎక్కడి దొంగలు అక్కడనే, గప్‌చిప్ సాంబారుబుడ్డి" రేపటి పౌరులు పిల్లల ఆట చెల్లాచెదరు.

పాం... పపాం. పాంయ్... పాంయ్ పాంయ్... పోలీసు జీపు హారన్ మోత. పల్లె వాసుల గుండె కోత.

రానే వచ్చింది. ఇంటి ముందాగింది.

టక్‌టక్ టక్‌టక్... ఎర్రటోపీల బూట్ల ఉనికి. గాల్లో రెక్కలు విప్పిన లాఠీలు.

"అరేయ్... ఎవడ్రా.. ఇంట్ల ఎవడ్రా?" ఉరుము.

"ఏంది సారు? నేనే" పులి ముందు పిల్లి.

"నిజం చెప్పకుంటే బాజాలు మోగుతై. అన్నల జాడ జెప్పకుంటే అన్యాయమైపోతావ్ బిడ్డా!" యస్సై మెరుపు... అందులో చిరునవ్వు గూడా.

కంగారు, భయం... యజమాని వెన్నముకలో వానపాముల పరుగులు. తడారిన నాలుక తటపటాయింపు. జోడించిన చేతులు.

"ఏంది దొరా! మా ఇంటి కొచ్చిండ్రా?" ఇల్లాలి కాళ్ళు బొయ్యి కడుపులో జొచ్చినై. నుదిటి చెమట కుంకుమ బొట్టును కరిగిస్తుంది. గుండెల్లో గుబులు.

"ఔను. మీ ఇంటిగ్గాకపోతే, మా ఇంటికా?" మీసాలు దువ్వుతున్న ఎర్రటోపీ వెకిలి నవ్వు.

"ఎందుకు?... ఎందుకు దొరా?"

"హబ్బ! మాయల ఫక్కీరు పక్కన సంగుదొర్నానేవె బాగున్నవే పోరీ! ఏమి దెల్వదా? చెప్పకుంటే చెమ్డాలూడుతై..." హెడ్డు కనుగుడ్లు కోడిగుడ్లై పోయినై.

ఆసక్తి, ఆందోళన రెండు కళ్ళుగా దూరంగా నిల్చున్న జనాలు క్రైం సినిమా ప్రేక్షకులయ్యారు.

"రాత్రికి మీ ఇంటికి అన్నలొచ్చిండ్రా లేదా?" హెడ్డు కానిస్టేబుల్ హెడ్డునేదో తొలిచింది.

హన్నా! గిప్పుడే వీళ్ళకెట్లా తెల్సిందో!

"చెప్పవేంరా బాడ్కావ్?"చెంప ఛెళ్ళు.

"వామ్మో... వాయ్యో! అన్నలు మా ఇంటికెందుకొస్తరు సారు?" ఉబ్బి పూర్ణంబూరెగా మారిన చెంప మీద చెయ్యి పుణుకుడు.

"రాత్రికి మీ ఇంటికి అన్నలొచ్చెండ్రు. మీరు వాళ్ళకు కోడికూరతోని అన్నం బెట్టిండ్రు గదరా సాలె!"

నెత్తి మీద సుత్తి దెబ్బ. యజమాని గొంతులో పచ్చి వెలక్కాయ.

"అన్నలా? మా ఇంటికా? మేమేమన్నా సిరిమంతులమా జమీం....దా....ర్ల...మా?" ఎంత ప్రయత్నించినా ఇల్లాలి పెదాల మీదికి చిరునవ్వు రాలేదు.

"ఆ నఖ్రాలన్నీ నడువవ్. అన్నలకు అన్నం బెడ్తే బాగుండదని ముందే చాటింపు వేయించినం గదా! అన్నలు బస్సులు కాలవెడ్తుండ్రు. బాంబులేస్తుండ్రు. అడవుల్ల ఉంటున్నారు. అర్ధరాత్రి గొర్ల మంద మీదికి తోడేలోలె వచ్చి మీ అసోంటోల్లను బెదిరించి వండించుక తింటుండ్రు. మీకేం భయం లేదు. మేమున్నం. చెప్పు..." యస్సై సముదాయింపు.

కొన్ని రోజుల క్రితం అన్నలకు అన్నంబెట్టి పోలీసులకు నిజం చెప్పిన ఎదురింటావిడ పసుపుకుంకాలకు దూరమైన వైనం, నిజం చెప్పక పోలీసు బోనులో చిత్ర హింసలనుభవించిన పక్కింటాయన... అందరికీ తెలుసు.

" నిజం దొరా! మేము అన్నలను రానిస్తలేము."

"ఔను సారూ! అన్నలు మా ఇంటికి రాలేదు."

అమాయకత్వంలో ఆరబోసిన చలాకితనం.

"నీయవ్వ! పోలీసోడంటే పియ్యి పిసుక్కునే పోరగాడనుకున్నావే పోరీ!" ఇల్లాలి ఎర్రని వీపు మీద కర్రె లాఠీ తైతక్కలు. తలవెంట్రుకలు బట్టి లాగగానే బొక్కబోర్లా పడిపోయింది.

"వామ్మో... వాయ్యో....గిదేంది దొరా?" లబోదిబో. నేలకు గీసుకున్న నుదురు, ముక్కుతో మొహం మంకెన పూవైంది.

"దాన్నేమనకుండ్రి సారూ! మీకు దండం సారు!"

అడ్డొచ్చిన యజమాని వీపు లాఠీల పాలిట చాకిరేవైంది.

"చెప్పు రా! చెప్పు బే! అన్నలెక్కడున్నారో చెప్పురా బాడ్కావ్! నీయవ్వ..." యస్సై అగ్గి మీద గుగ్గిలం. జబ్బల మీద గుద్దుల వర్షం కురిపించాడు.

"నా... నాకేం దెల్సు సా...రూ?" యజమాని కళ్ళు బైర్లు కమ్ముతున్నై. నిలదొక్కుకోలేకపోతున్నాడు.

" వీడిట్లా చెప్పడుగానీ లంజ కొడుకుని జీపెక్కించుండ్రి. వాని సంగతక్కడ జూద్దాం."

ఖాకీల చేతుల్లో యజమాని బలి వేదికి లాక్కెల్తున్న మేక. ఇల్లాలు ... పక్కనున్న హెడ్డు కాళ్ళను చుట్టేసి "మీ కాల్మొక్త, మాకేం దెల్వదు దొరా!" బతిమాలింది. కడుపులోంచి తన్నుకొచ్చిన దుఃఖం కంటి దారలై కాళ్ళను తడిపేసింది.

జర్ర్... జర్ర్...బర్రు... బర్...జీబు జారుకుంది. ఇల్లాలు పడిపోయింది.

"నిజం చెబితే వాళ్ళు, చెప్పకపోతే వీళ్ళు... యమదూతలై పోయిండ్రు".

"పట్టవద్దంటే పాముక్కోపం, విడువొద్దంటే కప్పకు కోపం. పల్లెలు భగ్గుమంటున్నై" జనాల సానుభూతి చప్పరింతలు.

ఈ సంఘటనలన్నీ గుడి పూజారి రామాచారి విన్నవే కన్నవే. మనస్తాపానికి కారణమైనవే.

రోజట్లాగే ఆ రోజు అలిసిన సూర్యుడు పడమటి విశ్రాంతి గృహం గుమ్మందాకా వెళ్ళాడు రోజంతా పొలాల్లో రెక్కలు ముక్కలు చేసుకున్న ఆడ కూలీలు పాటలు పాడుతూ ఊళ్ళోకొస్తున్నారు

పార్టీలు మారడమే పరమార్థమనుకున్న రాజకీయ జంతువులా వాతావరణం రంగు మారి బూడిద వర్ణమైంది. గూళ్ళకు తిరిగొస్తున్న పక్షులను తాకాలని గోధూళి పైపైకి ఎగురుతూంది..

రోజట్లాగే గుడి తలుపులు తెరిచాడు రామాచారి. సుమ పరిమళాల గుబాళింపు గుప్పుమని ముక్కుపుటాలకు తాకింది. గర్భగుడి చెట్టూ పెరిగిన పూల చెట్ల కొమ్మలు గాలి తరంగాలకు కరచాలనం.

చేసుకుంటున్నాయి. రేకులు విప్పిన పారిజాతాలు, సన్న జాజులు మేమిక పరమాత్ముని పాదాల చెంత పరవశించబోతున్నామన్న సంతోషంతో నవ్వుతున్నాయి. అప్పుడే... ఆకాశం చీకటి తెరలు దించుతూంది. లైటు వేయగానే గర్భగుడి నిండా వెండి పూతలా పరుచుకుంది వెలుతురు.

మంత్రోచ్చారణతో పూజ చేసేప్పుడు వర్షాకాలం చెరువులో కప్పలు చేరినట్టుగా నిండిన జనాలు తీర్థప్రసాద వితరణ కాగానే మాయమయారు. చివరి హారతిచ్చి గర్భగుడికి తాళం వేసేప్పటికి రాత్రి ఎనిమిది దాటింది. బయటి తలుపులకు తాళం బిగించేప్పుడు - ఓ యువకుడు లేడిపిల్లలా పరుగెత్తుకొచ్చాడు.

"ఈ రోజు రాత్రి నలుగురన్నలు మీ ఇంటికి భోజనానికొస్తరు. వంట తయారుండాలి. ఈ సంగతి ఎవరికన్నా తెలిస్తే ప్రాణాలెగిరిపోతై" చెవిలో చెప్పి చెవుల పిల్లిలా తుర్రుమన్నాడు. కాసేపు గాలి స్తంభించింది.

గుడి విరిగి మీద పడిపోయినట్టని పించింది. ఇంటికెట్లా చేరాడో తనకే తెలీదు.

"మామయ్య మడి గట్టుకుని మీ కోసమే ఎదురు చూస్తున్నారు. లేవండి భోజనానికి" భార్య పిలుపు బుర్రకెక్కలేదు. పిల్లలిద్దరు నిద్రలోకి జారుకున్నారప్పటికే. ముప్పయ్యేళ్ళ రామాచారి మొహం ముకులించుకు పోయింది.

"ఏమైందీ? అట్లైందుకున్నావురా?" అరవై దాటిన తండ్రి వెంకటాచారి పలుకరింపు.

చెప్పేశాడు. అంతా చెప్పేశాడు. భార్య జానకి అంతా వింది.

"అయ్యోరామ! ఎట్లానండీ మరి? అన్నలకు అన్నం బెడితే పోలీసోల్లు పొడుచుకు తింటరు గదా!" గుండెలు బాదుకుంది.

"పెట్టకపోతే అన్నలు అంతు జూస్తరు గదమ్మా!" వెంకటాచారి నుదిటి గుంతల్లో కొత్త మెలికలు.

"మరెట్లా నాన్నా? ముందు నుయ్యి, వెనుక గొయ్యి".

భగవంతుడా! తోడు నీడైన భార్యను తొందరగా తీసుకెల్తివి. కంటికి రెప్పలా కనిపెట్టుకుంటున్న కొడుకు బతుకు అడకత్తెరలో పోకచెక్కైంది... ముసలి ప్రాణం ఉసూరుమంది.

"వాళ్ళ తలపండు పగలా! వాళ్ళకు చావు రానూ! వాళ్ళు నాశనమైపోనూ! మనమే దొరికినామా!..."

కోడలు శాపనార్థాలకు కోపం రాలేదు. మనసు పొరల్లో చిన్ననాటి ఉరుములు.... ఏరుల పారే బాల్యం. తనకప్పుడు ఎనిమిదేళ్ళు. కోటి రతనాల వీణ తెలంగాణా గుండెల్లో ఓ వైపు రజాకారర్లు, మరో వైపు నైజాం వ్యతిరేకోద్యమకారుల వీరంగం. నల్లగుండెల తెల్లదొరలు దేశాన్ని వదిలిపోయినా తెలంగాణాను

వీడని బానిసత్వం. భారతదేశములో తన రాజ్యాన్ని కలిపేది లేదని నైజాం మంకుపట్టు. తన తొత్తులైన రజాకార్లనుసిగొల్పాడు. కాఫిర్ల మీద పిచ్చికుక్కల్లా విరుచుకుపడ్డ రజాకార్ల అకృత్యాలకంతం లేదు.

నరరూప రాక్షసుల గృహదాహనాలు, మానభంగాలు, పట్టపగలు దోపిడీలు నిత్యకృత్యాలు. నైజాం వ్యతిరేక ఉద్యమాన్ని ఉక్కు పాదాలతో అణచడం, ఉద్యమకారులకు మద్దతునిచ్చిన ప్రజల్ని చిత్రహింసలు పెట్టడం రజాకార్ల రోజువారీ కార్యక్రమము.

అర్ధరాత్రి ఉద్యమకారులు ఊళ్ళోకొచ్చిబెదిరించి వండించుకు తినడం, నైజాం ప్రభుత్వానికి పన్నులు కట్టిన వాళ్ళ తలకాయల్ని పుచ్చకాయల్లా లేపేయడం. పగలు రజాకార్లు రావడం, ప్రజల్ని నడిబజార్లో నిలబెట్టి కాళ్ళూ చేతులూ నరికెయ్యడం, గాయాల మీద కారం పొడి చల్లి ఆనందించడం, యువతుల స్తనాలు కోసెయ్యడం, మర్మాంగాల్లో కారం చల్లడం... తెలంగాణా అగ్నిగుండమైపోయింది.

ఓ రోజు తనింటికొచ్చిన ఉద్యమకారుల్ని అమ్మానాన్నలేం చేశారు? బాగా గుర్తుకొచ్చింది. కొడుకూ, కోడలుకు చెప్పాల్సింది చెయ్యాల్సింది ఉపదేశించాడు వెంకటాచారి.

కిటికీలోంచి ఆకాశం... పిండారబోసిన వాకిలిలా కన్పిస్తుంది. అడ్డొచ్చిన మబ్బుల్లోంచి దూసుకుంటూ వెళ్తున్న చంద్రుని ప్రయాణం ఆగడమే లేదు. కర్తవ్యాన్ని మరువడమే లేదు.

టకటక టకటక... తలుపుల మీద తబలా మోత. కిర్ర్... కిర్ర్ర్... ఒకటే తలుపు తెరుచుకుంది.

"అన్నలమొచ్చినం, అన్నం తయారైందా?"

"రండి రండి... ఇల్లు చిన్నది. తలుపు గూడా చిన్నదే... ఒక్కొక్కరే రావాలి." గుమ్మం వద్ద వెంకటాచారి స్వాగతం... మందహాసం గూడా.

తలవంచితేనే ప్రవేశం. అన్నల తుపాకులు చంకల్లోకొచ్చేసినై. మొదటాయన తలవంచి లోపల ప్రవేశిస్తున్నాడు. లోపల ఏముందో కనబడకముందే కళ్ళనిండా కారం పొడి నిండుకుంది. అరవకుండా నోటి నిండా గుడ్డలు. పొత్తికడుపులో చురకత్తుల కసకసలు. అన్ని పనులొకేసారి జరిగిపోయినై. హఠాత్పరిణామం.

నలుగురికీ అదే బహుమానం. బలవంతపు హాహాకారాలు, రక్తం మడుగులో నలుగురి అంగలార్పులు. తోరణదుర్గం జయించిన వీరశివాజీలా పొంగిపోతున్నాడు వెంకటాచారి. కళ్లల్లో కారం గొట్టి నోట్లో గుడ్డలు కుక్కడం రామాచారి పని, రోజూ పూజలందుకుంటున్న మహిషాసుర మర్దని త్రిశూలానికి పని జెప్పడం జానకి వంతైంది. పథకం పొల్లుబోకుండా అమలైంది.

ఇంటి నిండా రక్తం ముగ్గులు.

"విప్లవం వర్ధిల్లాలి...
విప్లవం వర్ధిల్లాలి."
తండ్రీ, కొడుకూ, కోడళ్ల కోరస్.

జాగృతి, ఏప్రిల్ 7 - 13, 1997.